సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


శంషాబాద్ కమ్యూనిటీ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక
- శంషాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ

శంషాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సరైన వైద్య సేవలందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మందుల పంపిణీ, ల్యాబ్ తదితర వివరాలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని, వారికి అత్యుత్తమ సేవ లందించాలన్నారు. ఆస్పత్రికి అభివృద్ధికి అవసరమైన నిధులు తదిర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగమణి తదితరులు ఉన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు పట్టణంలోని బార్లు, లాడ్జీలో ఆర్‌జీఐఏ పోలీసులు బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏకకాలంలో వేర్వేరు ప్రాంతాల్లోని లాడ్జీలు, బార్లలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందాలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, బార్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఏసీపీ కె.ఎస్ రావు హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎయిర్‌పోర్టులో తనిఖీలు చేస్తున్న శంషాబాద్ ఏసీపీ కేఎస్ రావ్ తదితరులు

కాలనీల్లో అంధకారం


కాలనీల్లో వెలగని వీధి దీపాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి, ప్రశాంత్ కాలనీ, న్యూ వీకర్ సెక్షన్ కాలనీల్లో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏడాది కొత్త లైట్లు అమర్చక పోగా పని చేయని లైట్లకు కనీసం మరమ్మతులు సైతం చేయడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కల సాకారం..


ఎంటేరువాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన.

పూర్తికావచ్చిన వంతెన నిర్మాణం

- తీరనున్న కష్టాలు
- పలు గ్రామాలకు రాకపోకలు

శంషాబాద్ రూరల్: పలు గ్రామాల ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. మండలంలోని పిల్లోనిగూడ శివారులో ఎంటేరువాగుపై నిర్మిస్తున్న ఈ వంతెన అందుబాటులోకి వస్తే పలు గ్రామాల ప్రజల దూర భారం కష్టాలు తప్పుతాయి. కొత్తూరు మండలం, మక్తగూడ గ్రామం–పిల్లోనిగూడ మధ్యలో ఉన్న ఎంటేరు వాగుపై వంతెన నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకంలో సుమారు రూ.7 కోట్లతో ఈ పనులు కొనసాగుతున్నాయి.

వంతెన పూర్తయితే..

ఎంటేరువాగుపై చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయితే వాహనదారులకు దూర భారం తప్పుతుంది. కొత్తూరు, శంషాబాద్, చేవెళ్ల, షాబాద్ మండల వాసులకు ఈ మార్గం సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలంలో వాగు నీటి కారణంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తుంది. దీంతో ఎంటేరువాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన అధికారులు గతంలో తాత్కాలికంగా వాగులో పైపులు ఏర్పాటు చేసి రాకపోకలు సాగేలా చేశారు. అయితే భారీ వరదలు వస్తే పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేంది. దీంతో ఇక్కడ భారీ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. సుమారు మూడేళ్ల క్రితం ప్రారంభమైన వంతెన పనులు తుది దశలో ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమైనందున త్వరగా ఈ వంతెనపై రాకపోకలు ప్రారంభిస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయి.


అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు.

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం..

పాల్మాకుల గ్రామం నుంచి రాయన్నగూడ చౌరస్తా వరకు బెంగళూరు జాతీయ రహదారి–షాబాద్ రహదారిని కలుపుతూ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో రోడ్డుపై పూర్తిగా కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డును తవ్వి వదిలేశారు.

ఇబ్బందులు తొలగుతాయి.



రోడ్డు విస్తరణతోపాటు వంతెన పనులు త్వరగా పూర్తి చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. వర్షాలు వస్తే వాగు దాటకుండా వరద పారుతుంది. వంతెనపై నుంచి రాకపోకలను కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

జుర్కి రమేష్‌పటేల్, పిల్లోనిగూడ, శంషాబాద్.

పరిశోధనా దినోత్సవ పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేసిన సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, డైరెక్టర్లు, అధ్యాపకులు,

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో 6వ పరిశోధనాదినోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఇన్‌చార్జి డైరెక్టర్, ఆర్,ఈ హెడ్ ప్రొఫెసర్ పి. రవీందర్‌రెడ్డి, సలహాదారు ఆర్,డీ ప్రొఫెసర్ ఏడీ శర్మ, అసోసియేట్ డైరెక్టర్ ఆర్,డీ డాక్టర్ టి. సుధాకర్‌బాబు, హెడ్స్, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు వినూత్న పరిశోధన, ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు గాను ఏటా పరిశోధనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పురోగతిని పెంపొందించటం. వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో పరిశోధన, ఆవిష్కరణలు ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. కార్యక్రమాన్ని డిసెంబర్ 13,14 తేదీలలో నిర్వహిస్తామని, అన్ని ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు, హ్యూమానిటీస్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


రవికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో సీఎస్ఈ ఏఐ,డీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రవికుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. డాక్టర్ ఇషాబాత్రా మార్గదర్శకత్వంలో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ , ఇంజినీరింగ్‌లో బ్లాక్ చైన్ మల్టీ అథారిటీ బాట్‌నెట్‌ను కలపడం ద్వారా క్లౌడ్ క్రిప్టోగ్రఫీ రూపకల్పన, విశ్లేషణ పేరుతో థీసిస్ సమర్పించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, హెచ్‌ఓడీ కె.రమణలతో పాటు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

మణికొండ విద్యార్థినికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు


మిర్యామి

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థినికి ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. మణికొండ పాఠశాలలో గత విద్యాసంవత్సరం 9.8 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించిన మట్ట మిర్యామి ప్రస్తుత విద్యా సంవత్సరంలో బాసరలో సీటు సాధించింది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉన్నత విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీలలో సీటు దక్కించుకోవటం ఎంతో గర్వకారణమని మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ అన్నారు. బాలిక కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించిన స్థానిక వీఫర్‌యు సహయోగ్ సంస్థ నిర్వాహకులు నార్సింగిలోని జాగృతి కళాశాలలో ఇంటర్ చదివిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీలో సీటు రావటంతో అందులో చేరుతుందన్నారు. బుధవారం పాఠశాలలో బాలికను ప్రధానోపాధ్యాయునితో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


విద్యార్థులతో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. సీసీ రోడ్డు, బీసీ కమ్యూనిటీ భవనం, పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తన్వీ, ఎంపీపీ జయమ్మ, సొసైటీ చైర్మన్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్న గోల్కొండ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైతు బంధు పథకం అమలులో రైతుల సలహాలు, సూచనల కోసం ఏర్పాటు చేసిన ఈ సభలో పలువురు రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.దౌనాకర్‌గౌడ్, డైరక్టర్లు మోహన్‌రావు, దేవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మీ, బాల్య, ఏట కవిత, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ దౌనాకర్‌గౌడ్

పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయండి



అత్తాపూర్: మొహర్రం పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతూ షియా యంగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైబరాబాద్ ప్రెసిడెంట్ సయ్యద్ రిజ్వాన్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, సీఐ వెంకట రామిరెడ్డిని కోరారు. మొహర్రం పండుగ సందర్భంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పోలీసులు బందోబస్తు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ మోసిన్ తదితరులున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేశారు. రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ రూ. 4.21 లక్షల విలువైన 24 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... సీఈఐఆర్ పోర్టల్ అనుగుణంగా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ సిబ్బందితో కలిసి సెల్‌ఫోన్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధితులు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు పనులు ప్రారంభం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ముదిరాజ్ శ్మశానవాటికలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, అన్ని కులాలకు సంబంధించిన శ్మశాన వాటికలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వీరయ్య, సత్తయ్య, లక్ష్మణ్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


ఖానాపూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్ వై.శోభ

మణికొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మిర్జాగూడ శాఖను నూతన భవనంలోకి మార్చినట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. ఖానాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ బ్యాంక్‌లో గ్రామీణ అవసరాలే కాక, అర్బన్ అవసరాలను కూడా తీర్చే అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లు, రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.40 లక్షల క్లెయిమ్స్‌ను నామినీలకు అదజేశారు. కార్యక్రమంలో రిజినల్ మేనేజర్ సయ్యద్ యూసుఫ్, బ్రాంచి మేనేజర్ కె.ఆశోక్, సర్పంచ్ జి.రవీందర్‌గౌడ్, ఉపసర్పంచ్ కిషన్‌సింగ్, ఐకేపీ, ఏపీఎంకే భీమయ్య, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శంషాబాద్: హిమాయత్ సాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. బుధవారం కొత్వాల్‌గూడ సమీపంలోని సాగర్ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉండవచ్చునని ఒంటిపై నల్లని ప్యాంటు, టీ షర్ట్ ధరించి ఉన్నట్లు ఆర్‌జీఐ పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్..

తప్పుడు వీడియోలు చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

శంషాబాద్: పార్లమెంటు ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్‌గాంధీపై ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి తప్పుడు వీడియోలు చేస్తున్నాడని అతడిపై కేసు నమోదు చేయాలని యూత్ కాంగ్రెస్ నేతలు బుధవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందిరానగర్‌కు చెందిన నాగిళ్ల శివాజీరాజ్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో రాహుల్‌గాంధీని అసభ్యంగా విమర్శిస్తూ చేస్తున్న పోస్టులు పెడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వ్యక్తులను కించపరిచేలా వీడియోలు చేస్తున్నాడన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో శంషాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు యాదవ్, పూర్ణ, మణికంఠ తదితరులున్నారు.

జీహెచ్‌ఎంసీ స్థలం కబ్జాకు యత్నం

అడ్డుకున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్‌లోని జీహెచ్‌ఎంసీ స్థలానికి బుధవారం అధికారులు ప్రహరీ నిర్మించారు. 200 గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఖాదర్ అక్రమార్కులను అడ్డుకుని వారు ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించారు. సదరు స్థలానికి ప్రహరీ నిర్మించి బోర్డును ఏర్పాటు చేశారు. మరోసారి కబ్జాకు యత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


ఎర్రకుంట కట్ట కాంపౌండ్ వాల్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఎర్రకుంటలో జరుగుతున్న కట్ట కాంపౌండ్ వాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీ సలహా మండలి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పి.వి నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో బుధవారం దక్షిణ ప్రాంతీయ పశు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ మల్లేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ,గొర్రెలు,మేకల పెంపకం, కోళ్ల,చేపల పెంపకంలో ఉన్న క్షేత్రస్థాయి సమస్యలు ,వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. సమావేశంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏకాంబరం , విస్తరణ సంచాలకులు మహేందర్, రిజిస్ట్రార్ జ్ఞాన ప్రకాశ్, డీన్ రఘునందన్, పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, ప్రొఫెసర్ సీహెచ్ సత్యనారాయణ విశ్వవిద్యాలయం అధిపతులు, శాస్త్రవేత్తలు, పశుసంవర్ధక శాఖ అధికారులు ,రైతులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి


వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మణికొండ: ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మణికొండ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, భారత్ వికాస్ పరిషత్(ఆర్యభట్ట బ్రాంచ్, హైదరాబాద్), ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘాల నిర్వాహకులతో కలిసి ఆయన మణికొండ హుడాకాలనీలోని ఎస్ఎస్ఆర్ వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్యం బాల్యంతో సమానమని, వారు మన జీవితాలను తీర్చి దిద్దేందుకు ఎన్నో త్యాగాలు చేశారని, అలాంటి వారిని ఆదరించి ఉన్నతంగా చూడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు బోజన సామాగ్రి, ప్లేట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రఘు, సతీష్‌కుమార్, ఎ. సురేందర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ తిప్పరాజు రమేష్‌బాబు, ఫణికుమార్, పెంటారెడ్డి, అంజనాదేవి, రామానుజం, సుగుణరాజు, బాపు, సరస్వతి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సంఖ్య మరింత పెరగాలని హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.వెంకటి అన్నారు. గోల్కొండ ఏరియాసుపత్రిలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రులను శుభ్రంగా ఉంచడంతో పాటు రౌండ్ ది క్లాక్ వైద్యులు అందుబాటులో ఉంటే సర్కారు దవాఖానలపై ప్రజలకు నమ్మకం కలుగుందన్నారు. ఎక్కువగా నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలని సూచించారు. సమన్వయంతో పని చేస్తేనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా, గోల్కొండ క్లస్టర్ ఎస్‌సీహెచ్‌వో డాక్టర్ మురళీ, గోల్కొండ ఏరియాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ వినాయక్‌రావు, ఆసుపత్రి గైనకాలజిస్ట్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటలో బోనాల ఏర్పాట్ల పరిశీలన

గోల్కొండ: గోల్కొండ కోటలో ఈ నెల7న బోనాల జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఈవో శ్రీనివాసరాజుతో కలిసి బుధవారం కోటను సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల కమిటీ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తరపున బోనాలు నిర్వహించడంతో ఈసారి భక్తులు సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు, వృత్తిపని సంఘం సభ్యులు శంకర్, ఈ.శివశంకర్, శివ, రాములు ఉన్నారు.

రైతులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

- పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో రైతుల డిమాండ్
- రైతు బంధుపై భిన్నాభిప్రాయాలు


వినతి పత్రం అందజేస్తున్న రైతు కరుణాకర్‌రెడ్డి

శంషాబాద్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సుల సౌకర్యం కల్పించాలని శంషాబాద్ పీఏసీఎస్ ప్రత్యేక సమావేశంలో పలువురు రైతులు డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో రైతులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. బుధవారం పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శంషాబాద్, కొత్వాల్‌గూడ, గొల్లపల్లి, ఊట్‌పల్లి, తొండుపల్లికి చెందిన రైతులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. పదెకరాల్లోపు రైతులకు రైతు బంధు స్కీం వర్తింప జేయాలని మెజార్టీ రైతులు అభిప్రాయపడ్డారు. కొందరు రైతులు ఐదు ఎకరాలు, మరికొందరు రైతులు సాగు చేసిన వారందరికి రైతు బంధు వర్తింప జేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సహకార అధికారి ధాత్రిదేవి, అధికారులు రఫీక్‌ఉద్దీన్, ఏఓ కవిత, వైఎస్ చైర్మన్ జ్ఞానేశ్వర్, పాలకవర్గ సభ్యులు చింతల నందకిశోర్, రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి, మైలారం సులోచన,పోచయ్య, శ్రీనివాస్,సంఘం కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని గుర్తించండి..

యాభై ఏళ్లకు పైగా సాగు చేస్తున్న శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్‌లో 103లో సుమారు 700 ఎకరాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక రైతు కరుణాకర్‌రెడ్డి అధికారులకు వినతి పత్రం అందజేశాడు. యాభై ఏళ్లకు పైగా సాగు చేస్తున్న భూములు సర్కారు భూములుగా పేర్కొన్నారని, ధరణి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి పథకం తమకు అందడం లేదన్నారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.